'ఎంసీఏ' రివాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 8: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంసీఏ (రెండేళ్ల కోర్సు) పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని, విద్యార్థులు మార్కుల మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రివాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి ఈ నెల 14వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 14వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

కలినరీ ఆర్ట్స్ పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 8: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పీజీ డిప్లొమా ఇన్ కలినరీ ఆర్ట్స్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ డిప్లొమా ఇన్ కలినరీ ఆర్ట్స్ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

రేడియోలాజికల్ ఫిజిక్స్ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 8 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పోస్ట్ ఎమ్మెస్సీ డిప్లొమా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్ కోర్సు పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి, రెండో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును ఈ నెల 13వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.300 అపరాధ రుసుముతో 16వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను ఈ నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చిలకలగూడ ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్ అన్నారు. శుక్రవారం మెట్టుగూడ ఆలుగడ్డబావి వద్ద చిలకలగూడ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులుతో కలిసి వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహనను కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... వాహనదారులు నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపరాదని తెలిపారు. – అడ్డగుట్ట, నవంబర్ 8

కంటోన్మెంట్‌లో పార్టీని బలోపేతం చేయండి

మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో మాట్లాడుతున్న బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్, బీఆర్ఎస్ నేతలు

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

కంటోన్మెంట్, నవంబర్ 8 : కంటోన్మెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేసే దిశగా నాయకులు అడుగులు వేయాలని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఆయన నివాసంలో బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్, మోండా డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆకుల హరికృష్ణ, బీఆర్ఎస్ నాయకుడు పనస సంతోష్‌తో కలిసి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల ఆటో యూనియన్‌లకు మద్దతుగా నిలిచిన నేపథ్యంలో నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తీసుకుంటున్న చర్యలను తసాని దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం తలసాని మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని, ఆరు గ్యారంటీల అమలు నోచుకోవడం లేదని దీనిపై ప్రజల్లోకి గట్టిగా వెళ్లాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. నిత్యం ప్రజల్లో ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, త్వరలోనే కంటోన్మెంట్ నేతలతో సమావేశమవుతానని తెలిపారు. కలిసికట్టుగా నేతలందరూ పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు నడుం బిగించాలని సూచించారు. పార్టీ అధిష్టానం ఇచ్చే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడూ స్పందించాలని స్పష్టం చేశారు. గతంలో బీఆర్ఎస్ సర్కారు చేపట్టిన సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం సక్రమంగా అందించడం లేదనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలకు సంబంధించి చెక్కులు మంజూరు అయినప్పటికీ లబ్ధిదారులకు అందజేయడం లేదని దుయ్యబట్టారు.

కార్పొరేటర్ నర్సింగ్ హాస్టల్ సందర్శన

బోయిగూడలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను సందర్శించిన కార్పొరేటర్ హేమలత

బన్సీలాల్‌పేట్, నవంబర్ 8 : బోయిగూడలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను శుక్రవారం బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కే హేమలత సందర్శించారు. వారం రోజులుగా డ్రైనేజీ పైపులైన్లు జామ్ కావడంతో విద్యార్థులు, ఇబ్బందులు పడుతున్నారని అధికారులు తెలిపారు. భవనంలో డ్రైనేజీ వ్యవస్థ శిథిలావస్థకు చేరిందని ఆమెకు వివరించారు. ఒకే భవనంలో నర్సింగ్ కళాశాల, నర్సింగ్ స్కూల్ నడుస్తున్నాయని, హాస్టల్ కూడా ఉన్నందున నీటి వాడకం ఎక్కువగా ఉన్నదని చెప్పారు. రెండు వైపులా ఫంక్షన్ హాళ్లు ఉండడంతో తమ భవనానికి చెందిన మ్యాన్‌హోళ్లు తరచుగా నిండిపోతున్నాయని తెలిపారు. నర్సింగ్ విద్యార్థులకు గాంధీ దవాఖాన ఎనిమిదో అంతస్తులో తాత్కాలిక వసతి సదుపాయం కల్పించడం జరిగిందని అన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు త్వరలో నూతన పైప్‌లైన్‌లను ఏర్పాటు చేస్తామని చెప్పారని వారు కార్పొరేటర్‌కు వివరించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఈ సమస్యను సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ దృష్టికి తీసుకెళ్తానని, త్వరగా సమస్య పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు కే లక్ష్మీపతి, జావేద్, రమేశ్, రాజేంద్రప్రసాద్, పురుశోత్తం, వెంకటేశ్‌లు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ అధ్యక్షుడుగా నాగేశ్వరరావు

ఎస్. నాగేశ్వర్‌రావు

ప్రధాన కార్యదర్శి ఎన్. సుమంత్

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 8: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) నూతన అధ్యక్షుడిగా ఎస్. నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ఎన్. సుమంత్, గర్ల్స్ కన్వీనర్‌గా స్వాతి ఎన్నికయ్యారు. పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర స్థాయి నిర్మాణ జనరల్ బాడీ సమావేశాన్ని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ చింతకింది కాశీం, డాక్టర్ ఆమంచి నాగేశ్వర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నాణ్యమైన విద్య కోసం విద్యార్థులు పోరాడాలని పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ చారిత్రక నేపథ్యంలో ఏర్పడిందని, కేవలం విద్యారంగ సమస్యల పరిష్కారానికి మాత్రమే కాకుండా సమాజ మార్పు కోసం విరామం లేకుండా పోరాడిందని గుర్తు చేశారు. జార్జిరెడ్డి వంటి వారు శాస్త్రవేత్త స్థాయిలో అధ్యయనం, పరిశోధనలు చేశారని కొనియాడారు. ప్రత్యేకంగా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు అంటే పరోక్షంగా విద్యను ప్రైవేటైజేషన్ చేయడమే అవుతుందని మండిపడ్డారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యా పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం సమావేశంలో పీడీఎస్‌యూ నూతన కమిటీలను ఎన్నుకున్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా స్వాతి, రుక్మత్ పాషా, సహాయ కార్యదర్శులుగా మంద సురేశ్, వెంకటేశ్, అంజి, కోశాధికారిగా కోటేశ్వర్‌లను ఎన్నుకున్నారు. గ్రేటర్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్, ప్రధాన కార్యదర్శిగా అంజి, ఉస్మానియా యూనివర్సిటీ నూతన అధ్యక్షురాలిగా కె. స్వాతి, ప్రధాన కార్యదర్శిగా రుక్మత్ పాషా ఎన్నికయ్యారు. ఎన్నిక అనంతరం కమిటీ సభ్యులతో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. నాగేశ్వర్‌రావు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు అజయ్, రాచకొండ ఉదయ్, శివకుమార్, సంతోష్, క్రాంతి, తిరుపతి, మహేశ్, మేఘన, శిరీష, సమ్రిన్, రవళి, మమత, వీరేశ్వరి, పవన్‌కళ్యాణ్, పర్వేజ్ కమల్, రాజు, ప్రేమ్, రాహుల్, మధు, శ్రీకాంత్, విజయ్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే జేఎల్ అభ్యర్థులకు నియామక పత్రాలు ఇవ్వాలి

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 8: ఇటీవల టీజీపీఎస్సీ ద్వారా ఎంపికైన 1392 జూనియర్ లెక్చరర్ అభ్యర్థులకు తక్షణమే నియామక పత్రాలు అందజేయాలని అభ్యర్థులు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో జేఎల్ అభ్యర్థులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 15 ఏండ్ల తరువాత ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో లెక్చరర్ల భర్తీకి 2022లో నోటిఫికేషన్ విడుదల చేశారని అన్నారు. 2023లో రాత పరీక్ష నిర్వహించగా, 2024 జూలైలో మెరిట్ జాబితాతో పాటు తుది ఫలితాలు విడుదల చేశారన్నారు. కానీ ఇప్పటి వరకు తమకు నియామక పత్రాలు అందజేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎస్సీ నిర్వహించి, 55 రోజుల్లో నియామక పత్రాలు అందజేసిన ప్రభుత్వం తమను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. జేఎల్‌లుగా చేరి రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్యను బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో అభ్యర్థులు డాక్టర్ లింగానాయక్, వేణు, రమేశ్‌రెడ్డి, సుమన్, రాజశేఖర్, అభిషేక్, నాగరాజు, శ్రీనివాస్, అజయ్, నరేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహంకాళి ఆలయంలో లక్ష్మీగణపతి యాగం

శ్రీ మహంకాళిఆలయంలో నిర్వహించిన యాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీ గణేశ్

మారేడ్‌పల్లి, నవంబర్ 8: సీఎం రేవంత్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ గణేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం కార్ఖానా లోని శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయం ఆవరణలో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో 100 మంది పురోహితులతో లక్ష్మీగణపతి యాగం, మృత్యుంజయ యాగం, నవచండీ యాగం, శత రుద్ర యాగాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులు పాల్గొని పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తేలుకుంట సతీశ్‌గుప్తా, సి. సంతోష్‌యాదవ్, సి. బద్రీనాథ్ యాదవ్, బల్వంత్‌రెడ్డి, నరేశ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

'తక్షణమే పీహెచ్‌డీ నోటిఫికేషన్ విడుదల చేయాలి'

రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 8: ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ కోర్సులో ప్రవేశాలకు నోటిఫికేషన్ తక్షణమే విడుదల చేయాలని వివిధ విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి, ఓఎస్డీ జితేందర్‌నాయక్‌కు విద్యార్థి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నేతలు మాట్లాడుతూ.. గతంలో పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిమూలంగా విద్యార్థులకు తీవ్ర నష్టం జరిగిందని వాపోయారు. పదవీ విరమణ చేసిన ప్రొఫెసర్లకు సైతం గైడ్‌షిప్ ఇవ్వాలని కోరారు. పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలో యూజీసీ నెట్ నిబంధనను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ నాయకులు రవినాయక్, అశ్వాన్, పాషా, కృష్ణ, శర్మ, మల్సూర్, రాము, సహజ, కోటేశ్వర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

నరేందర్‌గౌడ్‌కు ఓయూ డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 8: ఉస్మానియా యూనివర్సిటీ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగంలో పెండెం నరేందర్‌గౌడ్ డాక్టరేట్ సాధించారు. డాక్టర్ ఆర్‌కే పవన్ కుమార్ పర్యవేక్షణలో 'నీడ్ అండ్ ఇంపాక్ట్ ఆఫ్ కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్స్ ఫర్ ఎల్ఐఎస్ ప్రొఫెషనల్స్ ఆఫ్ అకాడమిక్ లైబ్రరీస్' అనే అంశంపై పరిశోధన పూర్తి చేసి నరేందర్ సమర్పించిన పరిశోధనా గ్రంథాన్ని పరిశీలించిన ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచి అధికారులు ఆయనకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేస్తున్నట్లు ఒక ప్రకటన విడుదల చేశారు. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం జెర్రిపోతులగూడెం గ్రామానికి చెందిన ఆయనను ఈ సందర్భంగా అధ్యాపకులు యాదగిరి , చక్రవర్తి, రవికుమార్, దుర్గాప్రసాద్, రాజాగౌడ్ తదితరులు అభినందించారు.

కేంద్రం నిధులిస్తున్నా.. లక్ష్యానికి దూరం

సమావేశంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

అమీర్‌పేట్, నవంబర్ 8 : నిరుపేదలు, మహిళా సంఘాల అభ్యున్నతికి కేంద్రం పెద్ద ఎత్తున అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీన వైఖరి పట్ల కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి శుక్రవారం బేగంపేట్‌లోని హోటల్ హరిత ప్లాజాలో జరిగిన జిల్లా అభివృద్ధి సమన్వయ సమావేశంలో అసంతృప్తి వ్యక్తం చేశారు. స్వచ్ఛ్ భారత్ మిషన్, బ్యాంకుల్లో ముద్ర, ఎడ్యుకేషన్ లోన్స్, జాతీయ రహదారుల అభివృద్ధి, బ్రిడ్జిల నిర్మాణాలతో పాటు అనేక అంశాలకు సంబంధించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్వయం సహాయక బృందాలు, సబ్సిడీ రుణాలు అందించడంలో తలెత్తుతున్న ఇబ్బందులపై రాబోయే సమావేశానికి పూర్తి వివరాలతో హాజరు కావాలంటూ అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అర్హులకు అందాల్సిన పథకాలపై బ్యాంకర్లు, లబ్ధిదారులను ఇబ్బందులకు గురి చేస్తున్న అంశాలు తన దృష్టికి వచ్చాయన్నారు. గత ఏడాది విద్యార్థుల ఉన్నత చదువుల కోసం కోసం కేంద్రం 1200 కోట్ల నిధులు అందించాలనే లక్ష్యంతో నిధులు కేటాయిస్తే, రాష్ట్ర ప్రభుత్వం కేవలం 130 కోట్లను మాత్రమే అందజేసిందని, ఇది చాలా తక్కువ అని అన్నారు. రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు తెలిపారు. బ్యాంకర్లు, అధికారుల మధ్య నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఎం.పి. ఈటల రాజేందర్, దిశ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

రజకుల బలం ప్రభుత్వానికి తెలియాలి

చిక్కడపల్లి, నవంబర్ 8 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వేకు వచ్చే అధికారులకు రజకులు తమ పూర్తి వివరాలను తెలిజేయాలని తెలంగాణ రజక అభివృద్ధి సంస్థ గ్రేటర్ హైదారాబాద్ చైర్మన్ ఎం. నర్సింహ అన్నారు. శుక్రవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ మందలపు గాంధీతో కలిసి ఆయన మాట్లాడుతూ.. రాజ్యాధికారం సాధించలంటే రజకుల సంఖ్య రాష్ట్ర ప్రభుత్వానికి తెలివాలని అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపల్లి రాజశేఖర్ రజక, కొండమీది హరినాథ్ రజక, చుక్కయ్య, చంద్రమోహన్, పొట్ట పోచల కిషన్, పెండ్యాల శ్రీధర్, సుధాకర్, చీమల అశోక్, రమేశ్ పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల ఉపాధి దెబ్బతినకుండా చూడాలి

ఎమ్మెల్యే తలసానితో అమీర్‌పేట్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు, చిరు వ్యాపారులు

అమీర్‌పేట్, నవంబర్ 8 : ఫుట్‌పాత్‌ల సుందరీకరణ పేరుతో చిరు వ్యాపారుల జీవనాధారాన్ని తలకిందులు చేసేలా జీహెచ్ఎంసీ అధికారులు చేపడుతున్న చర్యలను అడ్డుకోవాలంని కోరుతూ అమీర్‌పేట్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గుర్మిత్‌సింగ్, ఉత్తమ్‌సింగ్ రాజ్‌పురోహిత్ శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. అమీర్‌పేట్ మాజీ కార్పొరేటర్ ఎన్.శేషు కుమారితో నేతృత్వంలో మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులతో పాటు చిరు వ్యాపారులు పెద్దసంఖ్యలో ఎమ్మెల్యే తలసానిని కలిసి తమ ఉపాధి అవకాశాలు దెబ్బతినకుండా చూడాలంటూ విజ్ఞప్తి చేశారు. సౌత్ ఇండియన్ షాపింగ్ మాల్ నుంచి అమీర్‌పేట్ హనుమాన్ దేవాలయం మీదుగా కనక దుర్గమ్మ దేవాలయ పరిసరాల వరకు ఉన్న రోడ్డుపై ఆధారపడి దశాబ్దాలుగా అనేక మంది చిన్న చిన్న వ్యాపారులు చేసుకుంటూ మనుగడ సాగిస్తున్నారని, అయితే ఇక్కడి వ్యాపారుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్న పరిస్థితుల్లో ఎమ్మెల్యే తలసాని కలుగజేసుకుని సమస్య పరిష్కారానికి కృషి చేయాల్సిందిగా మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు చేసిన విజ్ఞప్తికి స్పందించిన ఎమ్మెల్యే తలసాని, శనివారం ఉదయం 10 గంటలకు అమీర్‌పేట్‌లో చిరు వ్యాపారుల సమస్యలను పరిశీలించేందుకు వస్తానని హామీ ఇచ్చారు.

బోర్ పనులు ప్రారంభం

బోర్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శైలజ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 8: బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని బౌద్ధనగర్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ కంది శైలజ అన్నారు. డివిజన్‌లోని ఎస్‌బీహెచ్ కాలనీ పార్కు, నల్లపోచమ్మ ఆలయం, ఎల్ఎన్ నగర్ ప్రాంతాల్లో పవర్ బోర్ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో అన్ని వర్గాలకు మేలు చేకూర్చారని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ హయాంలో సంక్షేమ పథకాలలో కోత విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కంది నారాయణ పాల్గొన్నారు.

హామీలు అమలులో కాంగ్రెస్ విఫలం

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎన్ శ్రీనివాసరావు

ముషీరాబాద్, నవంబర్ 8: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఎన్నికల హామీలను నెరవేర్చకుండా విఫలమైందని బీఆర్ఎస్ గ్రేటర్ నేత ఎంఎన్ శ్రీనివాస రావు అన్నారు. తమ తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకే హైడ్రా, మూసీ సుందరీకరణ నాటకాలాడుతున్నారని విమర్శించారు. శుక్రవారం భోలక్‌పూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హైడ్రా పేరుతో కొన్ని భవనాలను కూల్చివేసి హాడావుడి చేసి, సీఎం సోదరుల కట్టాడాలు ఉన్నందునే కూల్చి వేతలు నిలిపివేశారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఇచ్చిన హామీలను నేరవేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వివేక్, జంగ శ్రీనివాస్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, నవంబర్ 8: ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం(నేడు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆజామాబాద్ డివిజన్ ఏడీఈ జీ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు..

శివం ఫీడర్ పరిధిలోని ప్రశాంత్‌నగర్, టీఆర్‌టీ క్వార్టర్స్, శివం టెంపుల్, నర్సింహబస్తీ, తరుణి సూపర్ మార్కెట్, విద్యానగర్ రైల్వే స్టేషన్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు..

బ్రాహ్మణ హాస్టల్ ఫీడర్ పరిధిలోని ఇందిరానగర్, బ్రాహ్మణ హాస్టల్, తిలక్‌నగర్ ఆసుత్రి, న్యూ నల్లకుంట పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తారు.

రోడ్డు విస్తరణలపై బోర్డులో చర్చ

● 60 మీటర్లవరకు విస్తరించాలని ప్రభుత్వం
● 40 మీటర్లకు పరిమితం చేయాలని బోర్డులో ప్రతిపాదన
● కేంద్రం నుంచి రావాల్సిన సర్వీస్ చార్జీలపై రక్షణశాఖ మంత్రిని కలుస్తానన్న ఎంపీ ఈటల
● తాగునీటి బిల్లుల బకాయిల చెల్లింపునకు బోర్డు ఆమోదం

కంటోన్మెంట్ బోర్డు సమావేశంలో పాల్గొన్న బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ ఎన్‌వీ నంజుండేశ్వర, ఎంపీ ఈటెల రాజేందర్, సీఈఓ మధుకర్ నాయక్, సభ్యుడు రామకృష్ణ

కంటోన్మెంట్, నవంబర్ 8 : కంటోన్మెంట్ పరిధిలోని జాతీయ రహదారుల విస్తరణపై బోర్డు సమావేశంలో వాడివేడీగా చర్చ కొనసాగింది. 44వ జాతీయ రహదారిలో ప్యారడైజ్ నుంచి బోయిన్‌పల్లి చెక్‌పోస్టు వరకు, రాష్ట్ర రహదారి ఒకటి మార్గంలో ప్యాట్నీ సెంటర్ నుంచి హకీంపేట వరకు రోడ్లను 60 మీటర్లకు విస్తరించనున్నట్లు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసిన నేపథ్యంలో గత ఆగస్టులో జరిగిన బోర్డు సమావేశంలో రోడ్ల విస్తరణను కేవలం 40 మీటర్లకే పరిమితం చేయాలని రాష్ట్ర సర్కారుకు మొర పెట్టుకున్నారు. ఈ క్రమంలో శుక్రవారం కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ ఎన్‌వీ నంజుండేశ్వర ఆధ్వర్యంలో జరిగిన కంటోన్మెంట్ బోర్డు సమావేశంలో మరోసారి ఈ విషయమై చర్చకు వచ్చింది. సమావేశంలో ఎంపీ ఈటెల రాజేందర్, సీఈఓ మధుకర్ నాయక్, నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణతో పాటు పలువురు బోర్డు అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టు విడవకపోవడంతో ప్రతిపాదిత రోడ్డు విస్తరణ కారణంగా పెద్ద సంఖ్యలో ప్రజలు తమ ఆస్తులతో పాటు, ఉపాధిని కూడా కోల్పోయే ప్రమాదముందని ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. ఈ నేపథ్యంలో ఆధునిక టెక్నాలజీని వినియోగించి, భవిష్యత్ అవసరాలకు ఇబ్బంది కలగకుండా 40 మీటర్లు మాత్రమే విస్తరించి రోడ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ సూచనలతో ఏకీభవించిన బోర్డు అధ్యక్షుడు, ఈ అంశంపై పునరాలోచించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వానికి మరోసారి లేఖ రాస్తామన్నారు. రోడ్ల విస్తరణ కారణంగా బోర్డుకు దక